## రాహుల్ పై కేసుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన..

### ఎఫ్ ఐఆర్ కాపీలు దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



**పటాన్ చెరు, సెప్టెంబర్ 1 (సిరి న్యూస్):**

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన కేసుకు నిరసనగా పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. హల్ద్వానీలో రాహుల్ గాంధీ సభ అనంతరం సభా ప్రాంగణాన్ని గంగా జలంతో శుద్ధి చేయడం బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల చర్యలకు నిదర్శనమన్నారు. అనంతరం ఎలాంటి విచారణ లేకుండా రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ నాయకులు రవి, ముదిరాజ్, సాయిలు, సిద్దేశ్వర్, అక్షిత్, ఐఎన్‌టీయూసీ నాయకులు రాజు, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

### తపస్ జిల్లా ఉపాధ్యక్షులు గడీల మాధవరెడ్డి.



**మెదక్ సెప్టెంబర్,01(సిరి న్యూస్)**

ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షులు గడిల మాధవరెడ్డి అన్నారు.టీజీఈజెఏసి రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరెడ్డి ప్రధాన కార్యదర్శి వౌడ్నాల రాజశేఖర్ పిలుపుమేరకు సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా గవర్నమెంట్ న్యూ హై స్కూల్ లో ఉపాధ్యాయులు మంగళవారం మధ్యాహ్న సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు నెలల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీని ఇచ్చిందని పేర్కొన్నారు.ఆ హామీనీ ప్రభుత్వం వెంటనే ऽఅమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏంఈఓ శంకర్,శ్రీనివాస్,నాసిరోద్దీన్, భాగ్య లక్ష్మి, అక్బర్ అలీ,, తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు పైతర గ్రామంలో ప్రత్యేక చర్యలు

- ప్రధాన వీధులు, కాలనీల్లో మందు పిచికారీ
- గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో




**కొల్చారం, సెప్టెంబర్ 01( సిరి న్యూస్)**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్చారం uh మండలంలోని పైతర గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవితేజ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దోమల నివారణకు ప్రత్యేక మందును వినియోగిస్తున్నామని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రత పాటించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### యూజీడీ పనులపై పరిశీలన..

# ప్రత్యామ్నాయ మార్గం వైపు దృష్టి

### భారతి నగర్ డివిజన్‌లో ఆదర్శ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి పర్యటన

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 1 (సిరి న్యూస్):**

భారతి నగర్ డివిజన్‌లోని ఫెన్సింగ్ ప్రాంతంలో యూజీడీ సమస్యలపై పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డీజీఎం శివతో కలిసి ఇప్పటికే మంజూరైన పనులు, చేపట్టనున్న పైప్‌లైన్ పనులపై అధికారులతో చర్చించారు. ప్రస్తుత మార్గంలో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో తరచూ జామ్ సమస్య తలెత్తే అవకాశం ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు. నీరు సజావుగా ప్రవహించేలా అవసరమైన చోట స్లోప్‌కు అనుగుణంగా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని సింధు ఆదర్శ్ రెడ్డి సూచించారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ధనుంజయ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, పెద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్తు నాయకులుగా ఎదగాలి..

- గీతం విద్యార్థులకు నౌకాదళ నిపుణుల సూచన
- నాయకత్వం, సాంకేతిక నైపుణ్యాలపై కమోడోర్లు జితేంద్రన్, బి.ఆర్. రాజు ఉద్బోధ

**రామచంద్రపురం(పటాన్ చేరు), సెప్టెంబర్ 1 (సిరి న్యూస్) :**



విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భవిష్యత్తు నాయకులుగా ఎదగాలని నౌకాదళ కమోడోర్ ఎం. జితేంద్రన్ వీఎస్ఎం సూచించారు. అప్పగించిన బాధ్యతను సమర్థంగా పూర్తి చేయడంలో క్రమశిక్షణ, నిబద్ధత కీలకమన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన కమోడోర్ బి.ఆర్. రాజుతో కలిసి పాల్గొన్నారు. 'భారత నావికాదళం: నాయకత్వం, ఇంజనీరింగ్, జీవితకాల అభ్యాసం' అంశంపై జితేంద్రన్ మాట్లాడుతూ ఐఎన్ఎస్ విక్రాంత్ నిర్మాణంలో తన అనుభవాలను పంచుకున్నారు. కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్టు చైర్మన్‌గా ఉన్న సమయంలో చేపట్టిన కీలక పనులను వివరించారు. ఐదు మిలియన్లకు పైగా భాగాలతో కూడిన నౌక నిర్మాణంలో ఇంజనీరింగ్, సేకరణ, అసెంబ్లీ ప్రక్రియల ప్రాధాన్యతను వివరించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి సాంకేతికతలను విద్యార్థులు తమ నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలను విశ్లేషించి, వినూత్న పరిష్కారాలు కనుగొనే సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. కమోడోర్ బి.ఆర్. రాజు 1965 ఇండో–పాకిస్తాన్ యుద్ధ సమయంలో తన అనుభవాలను వివరించారు. కరాచీ సమీపంలో దాదాపు 20 రోజుల పాటు నీటి అడుగున విధులు నిర్వహించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, జలాంతర్గామి కార్యకలాపాల్లో ఓర్పు, క్రమశిక్షణ, సంసిద్ధత ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు కమోడోర్లు సమాధానాలు ఇచ్చారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి. శ్రీనివాస్, వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ ఫకృద్దీన్ షేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాహుల్‌పై కేసుతో.. భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు





- ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

**రామచంద్రపురం, సెప్టెంబర్ 1 (సిరి న్యూస్):**

రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బండలగూడలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుధా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 01, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండల కేంద్రంలో గల రాయరావు సరస్వతి ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు మంగళవారం వన మహోత్సవంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ బి శ్రీనివాసులు, అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థుల సమక్షంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు హరితహారం కళాశాల కన్వీనర్ స్వామి, ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి మొక్కలు నాటడం వల్ల వచ్చే లాభాలు ఆరోగ్యమైన వాతావరణం నెలకొల్పడం వంటి విషయాల పైన అవగాహన కల్పించి విద్యార్థులతో మొక్కలు నాటించి వారికి మొక్కల సంరక్షణ బాధ్యతలు అప్పగించడం జరిగింది మొక్కలు నాటడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అలాగే కాలుష్య రహిత దేశంగా మారుతుందని ప్రిన్సిపాల్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ప్రిన్సిపల్ బి శ్రీనివాసులు అధ్యాపకులు నరసింహులు, మదన్ మోహన్ , నాందేవ్, శామయ్య, స్వామి, శ్రీనివాస్, బాలకృష్ణ, స్నేహ , వెంకటేష్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాలుగోన్నారు.

